క్లుప్తంగా

వేగవంతంగా రోడ్డు అభివృద్ధి పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టి జూలై నెలాఖరుకు వాహనాలు ప్రయాణించేలా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు విస్తరణ పనులను బుధవారం మునికూడలి వద్ద ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.70 కోట్లు కేటాయించిందన్నారు. మరో రూ. 35 కోట్లు అవసరమున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, కాంట్రాక్టర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, కవల కృష్ణమూర్తి, కవల దుర్గం, అంబటి రాజు, అమ్మిరెశెట్టి ఏసు, టీడీపీ నాయకుడు ఆరుమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రాజానగరం: సీఎం జగన్ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన నాలుగు 104 వాహనాలను బుధవారం ఆయన ఆకుపచ్చ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. వీటిలో రెండు రాజానగరం మండలానికి కాగా, మిగిలిన వాటిని కోరుకొండ, సీతానగరం మండలాలకు కేటాయించారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రంగంపేట: స్థానిక సొసైటీ వద్ద జిల్లా మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం శనగలు క్వింటాలుకు రూ.5330 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై వివాదం

సీతానగరం: మునికూడలి ర్యాంపు నుంచి తమ పట్టాభూముల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారంటూ ర్యాంపు నిర్వాహకులతో రైతులు బుధవారం వాగ్వాదానికి దిగారు. ర్యాంపు వద్దకు చేరుకుని, తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, ఎస్సై కె.శుభశేఖర్ అక్కడకు వెళ్లి రైతులతో చర్చలు జరుపుతున్నారు.

ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కొంకుదురులో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బుధవారం కొంకుదురు, కొమరిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, జిల్లా మహిళ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పి.వి.వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట పీహెచ్‌సీ తనిఖీ

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్టీ రాజాపురం గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

అవగాహన అవసరం

బిక్కవోలు: రైతులు పశుపోషణపై మరింత అవగాహన పెంచుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సత్యగోవిందు అన్నారు. బుధవారం బిక్కవోలు పశువైద్యశాల వద్ద ముర్రా గేదెల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని 40 దూడలు పాల్గొన్నాయి. వీటిలో ప్రథమ స్థానం గేదె సత్య నారాయణరెడ్డి, ద్వితీయ స్థానం ముప్పిడి కృషారెడ్డి, తృతీయ స్థానం బొట్టా సూరిబాబు దూడలు విజేతగా నిలిచాయి. ఈ సందర్భంగా వారికి బహుమతి అందించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ భరత్‌రామ్,
- ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆసరా చెక్కుల పంపిణీ



రాజానగరంలో ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు



రంగంపేటలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రాజానగరం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీకి రాబోయే ఎన్నికలలో మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. రాజానగరంలోని అన్నదాన సత్రం కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపి, ప్రజలందరూ అభివృద్ధి చెందాలనే ఆశయంతో సీఎం జగన్ ప్రజారంజక పాలనను అందిస్తున్నారన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన జగన్

ప్రజలకు ఇచ్చిన మాటను తూచ తప్పకుండా నెరవేర్చి, వారి కళ్లల్లో ఆనందాన్ని చూడటమే సీఎం జగన్‌కి తెలిసిన విషయమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలో ఆసరా పథకం ద్వారా మూడు విడతలలో 5,257 డ్వాక్రా గ్రూపులకు రూ.135 కోట్ల మేరకు ఆర్థిక సాయం చేకూరిందన్నారు. మూడో విడతలో 2,089 గ్రూపుల్లోని 20,890 మంది సభ్యులకు రూ.17.60 కోట్ల ఆసరా సొమ్ములు వారి బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయన్నారు. సమావేశంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, కోఆప్షన్ మెంబర్ కోడి రాఘవ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, పార్టీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరావు, అడబాల చినబాబు, వేమగిరి కృష్ణ, వాడ్రేవు శ్రీను, ఈ.కామేశ్వరావు, కుందేటి ప్రసాద్, కొల్లి వీర్రాజు, సంగీత ప్రసాద్, వెలుగు ప్రాజెక్టు అధికారులు జయంతి రాజ్, హేమనాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎంపీపీ మండారపు సీతారత్నం, వైస్ ఎంపీపీ కొల్లి సత్య ఆధ్వర్యంలో పలువురు మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేదికపై తొలుత అంబేడ్కర్, వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర నాయకులు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

రంగంపేట: రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత రుణమాఫీ నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీ భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో 5438 స్వయం సహాయక సంఘాలకు రూ.50 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. రంగంపేట మండలంలో 1165 స్వయం సహాయక సంఘాలకు రూ.9.22 కోట్లు మూడో విడత రుణమాఫీ చేశారన్నారు. ఈ సందర్భంగా యానిమేటర్లు, మహిళా శక్తి సంఘాల మహిళలతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. భరోసా ఇస్తూ..

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి గ్రామ సచివాలయం–5, 4 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆప్యాయంగా పలకరిస్తూ..వారి సమస్యలు తెలుసుకుంటూ..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ..ప్రజలకు భరోసా కల్పిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగో రోజు బుధవారం అనపర్తి గ్రామ సచివాలయం–5, 4 పరిధిలో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకూ వెళ్లి ప్రజలను కలుసుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి అందించామని అన్నారు. పేదల ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచి వారా కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళి, ఉపసర్పంచి పార్టీ నాయకులు మండ శ్రీనివాసరెడ్డి, బొబ్బిలి ఉమాశంకర్, పాదూరి డేవిడ్‌రాజు, వేళంగి రాజు, నందికోళ్ల రవి కుమార్, ఏసు పాల్గొన్నారు.

మహిళల సుస్థిర ఆర్థికాభివృద్ధికి బాటలు



మహేంద్రవాడలో ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



కరకుదురులో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ తులసి, సర్పంచి చంద్రకళ

- వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి
- పొలమూరు, మహేంద్రవాడ గ్రామాల్లో ఆసరా సంబరాలు

అనపర్తి: మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు సుస్థిర ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొలమూరు, మహేంద్రవాడ గ్రామాల్లో ఆసరా మడో విడత సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం జగనన్న మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో పొలమూరు, మహేంద్రవాడ ఉపసర్పంచిలు సత్తి సూరారెడ్డి, మల్లిడి గంగరాజు, ఇంచార్జ్ ఏపీఎం మణికుమారి, సీసీ ఆశాదేవి, మహిళలు పాల్గొన్నారు.

ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం

పెదపూడి: వైఎస్సార్ సీపీ మహిళా పక్షపాత ప్రభుత్వమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మండలంలో దోమాడ, కరకుదురు గ్రామాల్లో సర్పంచులు మీనవల్లి శారదదేవి, వుండ్రు చంద్రకళ అధ్యక్షతన బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కును ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సానా రాంబాబు, వాసంశెట్టి మాధవ, ఏపీఎం చిన బాబు, మీనవల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో ఎక్కువ సంక్షేమ పథకాలను మహిళలకే కేటాయించారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలో 1415 డ్వాక్రా సంఘాలకు మూడో విడతలో ఆసరా పథకంలో మంజూరైన రూ.13.42 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు సందర్శన

గోకవరంలో తూర్పుకాపు, వెలమ సంఘాలకు కేటాయించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే చంటిబాబు సందర్శించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' ఘనత సీఎం జగన్‌దే

గోకవరం: దేశంలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రి పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించేందుకు మంజూరైన అదనపు వాహనాన్ని బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సీనియర్ నాయకుడు కర్రి సూరారెడ్డిని ప్రకటించారు. వీరలంకపల్లిలో జరిగిన కార్యక్రమంలో రంపయర్రంపాలెం మాజీ సర్పంచ్ కర్రి అరుణకుమారి, శివరామకృష్ణ దంపతులు కొనుగోలు చేసిన జేసీబీ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గోకవరం గ్రామ దేవత గుబ్బాలమ్మ తీర్థం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ నరాలశెట్టి నర్సయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, పాల్గొన్నారు.

వైభవంగా కోటి తలంబ్రాల గ్రామోత్సవం

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన గొల్లల మామిడాడలో గురువారం జరిగే శ్రీ కోదండ రామాలయం కల్యాణంలో వినియోగించే గోటితో వలిచిన కోటి తలంబ్రాల గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు ఈ తలంబ్రాలను గోటితో వలిచారు. ఈ తలంబ్రాలు వలిచే కార్యక్రమం ముక్కోటి ఏకదశి రోజున ప్రారంభించారు. ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవల్లి రఘు రామాచార్యులు తలంబ్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి మోహన్‌రామ గంగాధర్‌రెడ్డి, కోదండరామాలయం ధర్మకర్త, చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.

1,053 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లిలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,053 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు వైద్య సేవలందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేశారు. స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని సీసీ రోడ్డు పనులకు ఎంపీటీసీ సభ్యులు బండారు శివ శంకుస్థాపన చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రామాలయం వద్ద, సొసైటీ వద్ద సీసీరోడ్లకు 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.1.10 లక్షలతో ఈ పనులు జరుగుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యురాలు తొండాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిర నిర్మాణానికి శంకుస్థాపన

కపిలేశ్వరపురం: అంగరలోని చేనేత సహకార సంఘం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీషిర్డీ సాయిబాబా మందిర శంకుస్థాపన పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించారు. గురువారం కాగడ హారతి, సుప్రభాతసేవ, అభిషేకం, మందిర శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మహాలక్ష్మీగా కల్యాణ వేంకటేశ్వరుడు



మహాలక్ష్మీ అవతారంలో కల్యాణ వెంకటేశ్వరుడు

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద ఉన్న నాంచార్మ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. వసంత నవరాత్రులు భాగంగా స్వామివారు నారాయణీ మాత అవతారంలో పూజలందుకున్నారు.

విద్యార్థుల ప్రతిభ

సీతానగరం: సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన సైన్స్, మేథ్స్, ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్‌లలో ప్రకటించిన సైన్స్ ఒలింపియాడ్ లెవెల్–2 లో చినకొండేపూడి సూర్యచంద్ర విద్యార్థులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారని సూర్యచంద్ర కరస్పాండెంట్ కె.ప్రసన్నరెడ్డి బుధవారం తెలిపారు. వారిని స్కూల్ చైర్మన్ కె.కనికిరెడ్డి, హెచ్‌ఎమ్ ఫణీంద్ర అభినందనలు తెలిపారు.

వరికోత యంత్రం పంపిణీ

బిక్కవోలు: బలభద్రపురం గ్రామానికి చెందని సాయి సత్య శ్రీనివాస్ గ్రూప్ రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం వరి కోత యంత్రాన్ని పంపిణీ చేశారు. రూ.25 లక్షల విలువ చేసి వరికోత మిషన్ రైతులకు రూ.3.70 లక్షలు మాత్రమే అందించారు. సర్పంచ్ బుంగా రామారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గోలింగేశ్వరస్వామి ఆదాయం రూ.3.17 లక్షలు

బిక్కవోలు: గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవదాయశాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. బుధవారం ఆలయం వద్ద గత ఏడాది డిసెంబరు 7వ తేదీ నుంచి నేటి వరకూ రూ.3.17,319 వచ్చినట్టు ఆలయం ఈఓ రామలింగ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.